ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ



సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

రసూల్‌పురా: గత ప్రభుత్వం సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ఆ పార్టీ నాయకులకు మాత్రమే అమలు చేసిందని సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేస్తోందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని రైతులకు లక్ష రూపాయల రుణమాఫీ చేయడంతో న్యూబోయిన్‌పల్లి అంబేద్కర్ చౌరస్తా, బోయిన్‌పల్లి మార్కెట్ యార్డులో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ శ్రేణులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మాట ఇస్తే కట్టుబడి ఉంటుందని లక్ష రూపాయలు రుణం తీసుకున్న ప్రతి రైతుకు మొదటి విడతలో రుణమాఫీ చేసిందని అన్నారు. మార్కెట్ యార్డు అధ్యక్షులు దేవేందర్ రెడ్డి, బద్రీనాథ్ యాదవ్, యాదగిరి, ఆనంద్‌బాబు, గిరి, ప్రభాకర్, మిరియాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

పదోన్నతులు, బదిలీ జాబితాలో తప్పులు

ఉస్మానియా యూనివర్సిటీ: సోషల్‌వెల్ఫేర్ ఎస్సీ గురుకుల విద్యా సంస్థల్లో టీచర్లు, అధ్యాపకుల పదోన్నతులు, బదిలీల జాబితా తప్పులు తడకగా ఉందని పలువురు టీచర్లు శుక్రవారం ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా ఇష్టారాజ్యంగా పదోన్నతులు, బదిలీలు చేశారని పేర్కొన్నారు. జాబితాలో ఒకే పేరుతో రెండు పదోన్నతుల ఉత్తర్వుల జారీతో పాటు కొందరికి పేర్లు లేకుండా పదోన్నతుల ఉత్తర్వులు, స్థానికతతో సంబంధం లేకుండా ఇతర జోన్లకు బదిలీ చేస్తున్నారని వివరించారు. 370 జీవోను రద్దుకు మంత్రి పొన్నం ప్రభాకర్ చైర్మన్‌గా కమిటీ వేశారు.

సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి



బీఓటీ టాయిలెట్ల ఇన్‌చార్జిలతో సమావేశమైన బేగంపేట డీఎంసీ సమ్మయ్య

సనత్‌నగర్: సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి ఆలయానికి వచ్చే భక్తులు ఉచితంగా బీఓటీ టాయిలెట్లను ఉపయోగించుకునే వెసులుబాటు కల్పించినట్లు బేగంపేట సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య స్పష్టం చేశారు. ఈ నెల 21, 22 (ఆది, సోమవారాల్లో) తేదీల్లో జరిగే జాతర దృష్ట్యా భక్తులు ఎలాంటి అసౌకర్యానికి గురి కాకుండా జీహెచ్‌ఎంసీ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా బేగంపేట సర్కిల్ కార్యాలయంలో జీహెచ్‌ఎంసీ శానిటేషన్ సిబ్బంది, బీఓటీ టాయిలెట్ల ఇన్‌ఛార్జిలతో శుక్రవారం సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. దేవాలయం చుట్టుపక్కల ఉన్న దాదాపు 15 బస్తీల్లో బీఓటీ టాయిలెట్లను అందుబాటులోకి తీసుకువచ్చామని, అలాగే ప్రతి పార్కింగ్ ఏరియాలో కూడా వీటిని ఏర్పాటు చేస్తామన్నారు. భక్తులు రెండు రోజుల పాటు ఎలాంటి రుసుము తీసుకోకుండా ఉచితంగా సేవలు అందించాలని సూచించారు.

హామీని నిలబెట్టుకున్న కాంగ్రెస్ పార్టీ

అమీర్‌పేట: ప్రజలకు ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకుందని ఆ పార్టీ అమీర్‌పేట డివిజన్ అధ్యక్షులు శ్రీనివాస్‌రావు అన్నారు. రైతులకు మొదటి విడత కింద ఒక లక్ష వరకు రుణాలు మాఫీ చేసిన సందర్భంగా అమీర్‌పేటలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల రుణాలు మంజూరు చేసిన ఘనత ఒక్క కాంగ్రెస్‌కే దక్కుతుందని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గోదాస్ నవీన్,మిర్యాల రాజు, అనస్‌జీత్‌కౌర్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ చిన్నారుల ర్యాలీ

అడ్డగుట్ట: రెండున్నర సంవత్సరాల పైబడిన పిల్లలందరినీ అంగన్వాడీ కేంద్రల్లో చేర్పించాలని అంగన్వాడీ టీచర్ రేణుక సూచించారు. అమ్మ మాట – అంగన్వాడీ బాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అడ్డగుట్ట బి సెక్షన్‌లోని అంగన్వాడీ కేంద్రం ఆధ్వర్యంలో చిన్నారులతో అమ్మపేరుతో మొక్కలు నాటించారు. అనంతరం, ప్లకార్డులు పట్టుకొని ఇంటింటికీ తిరుగుతూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మదర్స్ కమిటీ కన్వీనర్ బి. భాగ్య, అంగన్వాడీ కేంద్ర చిన్నారులు పాల్గొన్నారు.

ఓపెన్ జిమ్ ఏర్పాటుకు కృషి

బౌద్ధనగర్: పార్కుకు వచ్చే ప్రజలకు అన్ని రకాల వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామని కార్పొరేటర్ కంది శైలజ అన్నారు. డివిజన్‌లోని బౌద్ధనగర్ పార్కు, ఎస్‌బిహెచ్ పార్కును హార్టికల్చర్ అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. పార్కుకు వచ్చే వారికి వసతుల కల్పనతో పాటు వ్యాయామాల నిమిత్తం ఓపెన్ జిమ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా శుక్రవారం బౌద్ధనగర్ పార్క్, ఎస్‌బిహెచ్ పార్కులను సందర్శించినట్లు తెలిపారు. ఈ పరిశీలనలో హార్టికల్చర్ సూపర్‌వైజర్ సురేష్, ఇంజనీరింగ్ విభాగం సూపర్‌వైజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

బౌద్ధనగర్: ప్రతీ ఫ్రైడే ను డ్రైడే గా పాటించి పరిసరాలను పరిశుభ్రం చేసుకోవాలని కార్పొరేటర్ కంది శైలజ సూచించారు. బౌద్ధనగర్‌లోని జవహర్ స్కూల్‌లో ఫ్రైడే డ్రై డే పై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కార్పొరేటర్ కంది శైలజ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అప్పుడే ఎటువంటి వ్యాధులు ప్రబలకుండా ఉంటాయన్నారు.

కామర్స్ కోర్సుకు డిమాండ్

- రాష్ట్ర ఉన్నత విద్య మండలి చైర్మన్ ప్రొ.లింబాద్రి

ఉస్మానియా యూనివర్సిటీ: ఇతర కోర్సుల కంటే కామర్స్ కోర్సుకు డిమాండ్ ఉందని రాష్ట్ర ఉన్నత విద్య మండలి చైర్మన్ ప్రొ.లింబాద్రి అన్నారు. శుక్రవారం ఓయూ క్యాంపస్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కాలేజీ ఆధ్వర్యంలో జరిగిన వాణిజ్య–2024 కార్యక్రమానికి కామర్స్ హెడ్ ప్రొ.చెన్నప్ప అధ్యక్షత వహించగా ప్రొ.లింబాద్రి ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. కామర్స్ విద్యలో విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు వివిధ రకాల వాణిజ్య పోటీలను నిర్వహించనున్నారు. కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపల్ ప్రొ.శ్రీరాములు, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ డాక్టర్ రియాజ్ పాల్గొన్నారు.

అంతా మా ఇష్టం!

- కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం.. పట్టించుకోని అధికార గణం
- ఆర్యనగర్‌లో 2 ఏళ్లుగా ముందుకు సాగని సీసీ రోడ్డు నిర్మాణం
- నరకం చూస్తున్న స్థానికులు



ఆర్యనగర్‌లో ఆగిపోయిన సీసీ రోడ్డు పనులు

లాలాపేట: తార్నాక మున్సిపల్ డివిజన్‌లోని ఆర్యనగర్‌లో రెండేళ్ల క్రితం నిలిచిపోయిన సీసీ రోడ్డు నిర్మాణ పనులు ఇటీవల ప్రారంభమై మళ్లీ ఆగిపోయాయి. బస్తీలోన్ని రోడ్లన్నీ తవ్వి దాదాపు వారం పది రోజుల గడుస్తున్నా ఇటువైపు కాంట్రాక్టరు గానీ, అధికారులు గాని కన్నెత్తి చూడ లేదు. గంతల మయంగా మారిన కంకర రోడ్డుపై స్థానికులు రాకపోకలు సాగించలేకపోతున్నారు. ఉదయం పాఠశాలలు, వివిధ పనుల నిమిత్త వెళ్లే వారు, రాత్రి వేళలలో వృద్ధులు, చిన్నారులు, ద్విచక్ర వాహనదారులు తవ్విన రోడ్ల గుండా వెళుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రభుత్వం, అధికారుల తీరుపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- దాదాపు రెండు సంవత్సరాల క్రితం ఆర్యనగర్‌లో సీసీ రోడ్డు నిర్మాణానికి బస్తీలోని ఐదారు గల్లీ రోడ్లను తవ్వారు. తీరా తవ్వాక సదరు కాంట్రాక్టర్ తనకు ప్రభుత్వం నుంచి బిల్లులు చెల్లిస్తేనే రోడ్డు నిర్మాణం చేస్తాను అని పేచీ పెట్టి పత్తా లేకుండా వెళ్లిపోయారు. ఇలా దాదాపుగా సంవత్సరన్నర కాలం గడిచింది. ఇంత కాలం ఆర్యనగర్ వాసులు స్థానిక ప్రజా ప్రతినిధులకు, అధికారులకు పలు మార్లు ఫిర్యాదు చేస్తూనే ఉన్నారు.
- గత నెల ఇదే సీసీ రోడ్డు నిర్మాణ పనులు అదే గుత్తేదారుకు తిరిగి అప్పగించారు. దీంతో ఇక సీసీ రోడ్డు నిర్మాణం పూర్తవుతుందని ఆర్యనగర్ వాసులు భావించారు. దానికి అనుగుణంగానే కొంత సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. ఏమైందో.. కానీ మళ్లీ కథ అడ్డం తిరిగింది. తనకు బిల్లులు చెల్లించాలనీ అప్పటి వరకు రోడ్డు నిర్మాణం చేసేది లేదని కాంట్రాక్టర్ చేతులెత్తేసాడు. దీనిపై స్థానికులు క్రింది క్షేత్రస్థాయి అధికారులను ఆరా తీయగా సదరు కాంట్రాక్టర్ చాలా సీనియర్ 30 ఏళ్ల నుంచి ఇవే పనులు చేస్తున్నాడు, అతను తమ మాట వినడం లేదని చెప్పున్నాడని ఆర్యనగర్ వాసులు అంటున్నారు. ఇలా గత రెండేళ్ల నుంచి ఆర్యనగర్ వాసుల సీసీ రోడ్డు పనులు ముందుకు సాగడం లేదు.



కంకర తేలిన రోడ్డు..

- ప్రజా ప్రతినిధుల మాటను, అధికారుల మాటను సైతం ఖాతరు చేయలేని స్థితిలో గుత్తేదార్లు ఉన్నారా అని ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సంవత్సరాల తరబడి పనులను పెండిగ్‌లో పెడుతున్నా కాంట్రాక్టర్‌పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. తిరిగి వారికే మళ్లీ అభివృద్ధి పనులు ఎందుకు కట్టబెడుతున్నారని అంటున్నారు.
- గత ప్రభుత్వంలో డిప్యూటీ స్పీకర్, ప్రస్తుత శాసన సభ్యులు, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ ప్రాతినిధ్య వహిస్తున్న సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజక వర్గంలోని తార్నాక డివిజన్‌లో అభివృద్ధి పనులు ఈ విధంగా కొనసాగుతుంటే ఇక మిగతా ప్రాంతాల పరిస్థితి ఏమిటనీ ఆర్యనగర్ వాసులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

మినీ జాతరలో పోటెత్తిన భక్త జనం



దేవాలయంలో కిటకిటలాడుతున్న భక్తులు

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి బోనాల జాతర సందర్భంగా శుక్రవారం భక్తజనం పోటెత్తారు. ఉదయం నుంచి రాత్రి వరకు అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులుతీరారు. జాతరకు ముందు వచ్చే శుక్రవారం మినీ జాతరగా పిలుచుకుంటారు. దీంతో భక్తులు పెద్ద ఎత్తున బోనాలతో పాటు అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించేందుకు బారులు తీరారు. దేవాలయం నుంచి సుభాష్‌రోడ్‌లో క్యూలైన్లలో పెద్ద ఎత్తున నిల్చున్నారు. దీంతో దేవాలయ పరిసర ప్రాంతాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ ఈవో మనోహర్‌రెడ్డి వివిధ శాఖల అధికారులు ఏర్పాట్లు చేపట్టారు. కార్పొరేటర్ చీర సుచిత్ర అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న యాదగిరి

అడ్డగుట్ట: తెలంగాణ రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం రైతు రుణ మాఫీఅ చేయడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారని అడ్డగుట్ట వ్యవస్థాపకులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎస్. యాదగిరి అన్నారు. ఈ మేరకు శుక్రవారం అడ్డగుట్టలోని అంజయ్య విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎస్. యాదగిరి మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి రుణమాఫీ చేస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని చెప్పిన హరీష్‌రావు వెంటనే చేయాలని డిమాండ్ చేశారు. పదేండ్ల కేసీఆర్ పాలనలో రైతుల గురించి పట్టించుకున్న పాపాన పోలేదని, రైలు ఆత్మహత్య గురించి, గిట్టుబాటు ధర గురంచి ఏనాడూ పట్టించుకోలేడన్నారు. అందుకే రాష్ట్ర ప్రజలు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు బుద్ధి చెప్పారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు యాదగిరి, రాజయ్య, పీ. యాదగిరి, అరుణ, లక్ష్మి, రేణుక, ప్రభు, నాగయ్య, ఉమ, రమ, రాణి, మమత, నాగేష్, సాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

బోనాల చెక్కుల పంపిణీ



బోనాల చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

సనత్‌నగర్: కూకట్‌పల్లి నియోజకవర్గం బేగంపేట డివిజన్ పరిధిలోని ప్రకాష్‌నగర్ రామలింగేశ్వరస్వామి టెంపుల్ ఆవరణలో గురువారం వివిధ ఆలయాల కమిటీ ప్రతినిధులకు కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు బోనాల చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బోనాల సంస్కృతీ వైభవాన్ని నలుదిశలా చాటి చెప్పిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఉత్సవ నిర్వాహకులు ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకుని ఉత్సవాలను వైభవంగా నిర్వహించాలన్నారు. కార్పొరేటర్ టి.మహేశ్వరిశ్రీహరి, మహంకాళి అమ్మవారి ఆలయ బోర్డు సభ్యుడు విశాల్‌సూదం, నాయకులు శ్రీహరి, సురేష్‌యాదవ్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ఉద్యోగి కుటుంబానికి క్రెడిట్ సొసైటీ నిధి



క్రెడిట్ సొసైటీ వాటాధనాన్ని, నగేశ్ కుటుంబ సభ్యులకు అందిస్తున్న అధికారులు

సికింద్రాబాద్: ఇటీవల మృతి చెందిన రైల్వే ఉద్యోగి కుటుంబానికి సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ క్రెడిట్ సొసైటీ నుంచి రూ. 7 లక్షల చెక్కును శుక్రవారం అందించారు. ఉద్యోగంలో ఉండి మృతి చెందిన నాగేశ్ ఎంప్లాయీస్ క్రెడిట్ సొసైటీ వాటాదారుగా ఉన్నారు. ఆయన మృతి చెందక ముందు సొసైటీ నుంచి స్వీకరించిన రుణాన్ని క్రెడిట్ సొసైటీ ప్రతినిధులు మాఫీ చేశారు. తన వాటాకు అదనంగా ఉన్న రూ.7లక్షల చెక్కును నాగేశ్ భార్య సంతోష్‌కుమారికి అందించారు. సికింద్రాబాద్ సంచాలన్ భవన్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో దక్షిణమధ్యరైల్వే సీనియర్ డీఎస్ఓ సురేశ్, డీపీఓ రసనాదేవి, మజ్దూర్ యూనియన్ డివిజన్ సెక్రటరీ రవీందర్, రైల్వే ఎంప్లాయీస్ క్రెడిట్ సొసైటీ అధ్యక్షుడు చిలుకుస్వామి చెక్కును అందించారు.

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: బేగంపేట, ఈఎస్ఐ, లోధా సబ్‌స్టేషన్ల పరిధిలోని విద్యుత్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో కరెంటు సరఫరా ఉండదని గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ చరణ్‌సింగ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉ.10.30 నుంచి మ.12.30 వరకు శాంతిబాగ్, శివబాగ్, కేకేజోన్ హోటల్, డీకేరోడ్డు, మాజీ గవర్నర్ రోశయ్య లేన్, శివబాగ్, మ.12.30 నుంచి 2.30 గంటల వరకు శ్రీవెంకటేశ్వర టెంపుల్ లేన్, బీటైపు, 3ఆర్‌టీ క్వార్టర్స్, ఎస్‌ఆర్‌నగర్ కమ్యూనిటీ హాల్ మెయిన్‌రోడ్డు, గౌతమి ధామం స్కూల్ ఏరియా, ఓల్డ్ రిలయన్స్ ఫ్రెష్, జ్ఞాన సరస్వతి స్కూల్, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జయభారతి స్కూల్, శ్రీరామ్‌నగర్, దాసారం బస్తీ, సీ–టైప్ క్వార్టర్స్, సనత్‌నగర్ ఇండస్ట్రీయల్ ఏరియా, అల్లావుద్దీన్ కోఠి, లిక్కర్ కంపెనీ ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందని పేర్కొన్నారు.

కాంగ్రెస్ ఎమ్మెల్యే ఉన్నా.. నిధులింతేనా?

రసూల్‌పురా: కంటోన్మెంట్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే శ్రీగణేష్ ఉన్నప్పటికీ నియోజకవర్గంలోని ఆలయాల్లో బోనాల ఉత్సవాలను నిర్వహించేందుకు గతేడాది కంటే పదిశాతం మేర మాత్రమే అధికంగా నిధులు మంజూరయ్యాయని బీజేపీ నాయకులు విమర్శించారు. శుక్రవారం కంటోన్మెంట్ బోయిన్‌పల్లిలో బీజేపీ నాయకులు మాట్లాడుతూ సనత్‌నగర్, సికింద్రాబాద్ పక్క నియోజకవర్గాల్లో ఆలయాలు తక్కువ ఉన్నాయని అక్కడ ఒక కోటి 80 లక్షల రూపాయలు మంజూరయ్యాయని కాని కంటోన్మెంట్‌కు మాత్రం కేవలం 64 లక్షలు మాత్రమే మంజూరయ్యాయని ఎక్కువ నిధులు కేటాయించడంలో శ్రీగణేష్ విఫమలయ్యాడన్నారు.

గ్రూప్ -2, గ్రూప్ -3 పోస్టులు పెంచాలి

ఉస్మానియా యూనివర్సిటీ: విద్యార్థులు, నిరుద్యోగుల పోరాట ఫలితంగా గ్రూప్–2 పరీక్ష వాయిదా వేయడాన్ని స్వాగతిస్తున్నామని బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు చటారి దశరథ్, తుంగ బాలు, జంగయ్య శుక్రవారం పేర్కొన్నారు. పరీక్షల వాయిదాతో పాటు గ్రూప్–1కు 1: 100 మందిని మెయిన్స్‌కు ఎంపిక చేయాలని, గ్రూప్–2లో 2000, గ్రూప్–3లో 3000 పోస్టులు పెంచాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ భృతి రూ.4000, 25 వేల టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీ, జీవో 55 రద్దు చేసి, ఇష్టా రాజ్యాంగ కొత్త జీవో 29 తీసుకురావడం వెనుక రహస్యాన్ని బహిర్గతం చేయాలన్నారు.

జ్ఞానేశ్వర్‌కు సత్కారం



బన్సీలాల్‌పేట్: తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్ర జ్ఞానేశ్వర్‌ను తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ ప్రతినిధులు కలిసి అభినందనలు తెలిపారు. ఇటీవల చైర్మెన్‌గా బాధ్యతలు స్వీకరించిన బి. జ్ఞానేశ్వర్‌ను మహాసభ నాయకులు నీలం శ్రీనివాస్, సురేందర్, నరేష్‌కుమార్, గండయ్య, రాజయ్య, బాలు తదితరులు కలిసి పుష్పగుచ్ఛాలిచ్చి పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

విద్యుత్ ఏర్పాట్లు పరిశీలించిన ఎండీ

రాంగోపాల్‌పేట్: ఉజ్జయినీ మహంకాళి బోనాల జాతర సందర్భంగా విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తామని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖీ తెలిపారు. శుక్రవారం ఆయన ఎస్ఈ రవికుమార్, డీఈ శ్రీధర్, ఏడీఈ దుర్గా ప్రసాద్, ఏఈ రవికుమార్‌లతో కలిసి దేవాలయం పరిసర ప్రాంతాలను పరిశీలించారు. విద్యుత్ సరఫరాలో ఎక్కడ ఎలాంటి అవాంతరాలు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.



పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలి

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



పాన్‌బజార్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

బన్సీలాల్‌పేట్: గర్భిణులు రక్తహీనత బారిన పడకుండా పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. సికింద్రాబాద్ పాన్‌బజార్‌లోని నాగెల్లి దుర్గయ్య స్మారక పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గర్భిణీలు రక్తహీనత రాకుండా పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. గర్భిణీలు ఆరోగ్యంగా ఉన్నప్పుడే పుట్టబోయే బిడ్డ ఎదుగుదలతో పాటు ఆరోగ్యంగా ఉంటారన్నారు. అంతకు ముందు ఆసుపత్రిలోని ప్రసూతి గది, ఆపరేషన్ థియేటర్, ఫిమేల్ వార్డు, డ్రగ్స్‌స్టోర్ ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. అక్కడ అందుతున్న వైద్య వైద్య సేవలను గురించి కలెక్టర్ ఆర తీశారు. అక్కడే ఉన్న గర్భిణులతో మాట్లాడారు. ఆసపత్రి పరిసరాలను పరిశీలించి చేపట్టాల్సిన సాధారణ మరమ్మతుల వివరాలను సమర్పించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకట్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకట్, ఆరోగ్య కేంద్రం ఎస్పీహెచ్ఓ డాక్టర్ జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయించాలి



సమావేశంలో పాల్గొన్న సీఆర్పీఎఫ్, తల్లుల సంఘం ప్రతినిధులు

అడ్డగుట్ట: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పినట్లుగా విద్యా రంగానికి 15 శాతం నిధులు కేటాయించాలని సీఆర్పీఎఫ్ జిల్లా కార్యదర్శి చింతల లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం అడ్డగుట్టలోని బాబు జగ్జీవన్‌రామ్ కమ్యూనిటీహాలులో బాలల హక్కుల పరిరక్షణ వేదిక(సీఆర్పీఎఫ్), తల్లుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో చెప్పినట్లుగా విద్యారంగానికి 15 శాతం ప్రస్తుత అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో కేటాయించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందడం లేదని, భోజనంలో కూడా నాణ్యత లేదన్నారు. వీటిని పరిశీలించే వారే కరువైయ్యారన్నారు. అంతే కాకుండా మౌలిక వసతులు కూడా సరిగా లేవన్నారు. ఈ నెల 24 నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. సమావేశంలో ప్రవీణ్‌కుమార్, జము, శోభ, లక్ష్మి, పుష్ప, కౌసల్య, సుమలత, సందీప్, ఎంవి పౌండేషన్ ఆర్గనైజర్లు సువర్ణ, బాగ్య తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్‌ఎంసీలో విలీనం చేస్తే బోర్డు ఉద్యోగులకు ఇబ్బంది



విశ్రాంత ఉద్యోగుల సమావేశంలో మాట్లాడుతున్న పరశురాం

రసూల్‌పురా: కంటోన్మెంట్ ప్రాంతాన్ని జీహెచ్ ఎంసీలో విలీనం చేయడం ద్వారా ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న బోర్డు ఉద్యోగులతో పాటు, పదవీ విరమణ పొందిన ఉద్యోగులు కూడా అనేక సమస్యలు ఎదుర్కొంటారని విశ్రాంత ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం పదవీ విరమణ పొందిన అన్ని విభాగాల వెయ్యి మంది ఉద్యోగులు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా విశ్రాంత అధికారి పరశురాం మాట్లాడుతూ.. జీహెచ్‌ఎంసీలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు జీతాలు చెల్లించలేని దుస్థితి నెలకొని ఉందని పనులు చేస్తున్న కాంట్రాక్టర్లకు సకాలంలో డబ్బులు చెల్లించడం లేదని పత్రికల్లో, మీడియాలో సమాచారం వెల్లువెత్తుతోందన్నారు. ఇది తమకు ఆందోళన కలిగిస్తున్న విషయమని చెప్పారు. భవిష్యత్తులో ఒకవేళ జీహెచ్‌ఎంసీలో బోర్డు ప్రాంతం విలీనం జరిగినా తమ పెన్షన్లు, హెల్త్‌కార్డులు, ఐడీ కార్డులు ఇళ్ళ స్థలాల విషయంలో అధికారాలన్ని బోర్డు కార్యాలయ పరిధిలోనే ఉండాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అధికారులు ఇంజనీరింగ్ విభాగం విశ్రాంత అధికారులు రాములు గోపాల కృష్ణదాసు, చీఫ్ సూపరిటెండెంట్ విశ్రాంత అధికారి అక్బర్ అలీ పాల్గొన్నారు.

అమ్మవారి దర్శనానికి ఈసారి 10 లక్షల మంది

డీసీపీ సాధన రష్మీ పెరుమాళ్



విలేకరులతో మాట్లాడుతున్న డీసీపీ

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి బోనాల జాతర అన్ని శాఖల అధికారులతో కలిసి ప్రశాంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపట్టామని ఉత్తర మండలం డీసీపీ సాధన రష్మీ పెరుమాళ్ తెలిపారు. శుక్రవారం ఆమె తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జీహెచ్‌ఎంసీ, జలమండలి, విద్యుత్, ఆర్‌అండ్‌బీ తదితర విభాగాల అధికారులతో సమన్వయంతో కలిసి ఏర్పాట్లు చేపట్టినట్లు చెప్పారు. సుమారు 1500 మంది పోలీసులతో దేవాలయంతో పాటు చుట్టు పక్కల పరిసర ప్రాంతాల్లో బందోబస్తు ఏర్పాటు చేసి శాంతిభద్రతల సమస్యలు లేకుండా చూస్తామని చెప్పారు. అమ్మవారిని దర్శించుకునేందుకు 6 క్యూలైన్లు ఏర్పాటు చేశామన్నారు. దేవాయంలో లోపల, ఊరేగింపు జరిగే ప్రధాన ప్రాంతాల్లో 100కు పైగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని వీటితో పాటు క్రైమ్ సిబ్బంది, షీటీమ్ సిబ్బంది నిరంతరం పర్యవేక్షణ చేస్తుంటారని చెప్పారు. మధ్యాహ్నం 1.30గంట నుంచి సాయంత్రం 4గంటల వరకు శివసత్తులకు ప్రత్యేకంగా అనుమతిస్తామని చెప్పారు.

వ్యక్తి అదృశ్యం



దేవిడ్ (ఫైల్)

అడ్డగుట్ట: డ్రైవింగ్ లైసెన్స్ అప్‌లై చేసుకొని వస్తానని ఇంటి నుంచి వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన లాలాగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ షాహీద్ పాషా తెలిపిన మేరకు.. తర్నాక యాక్సిస్ బ్యాంక్ సమీపంలోని అమూల్య అపార్ట్‌మెంట్‌లో నివాసముంటున్న డేవిడ్ (29)ప్రైవేట్ ఉద్యోగి. ఈ నెల 14న ఉదయం డ్రైవింగ్ లైసెన్స్ అప్‌లై చేసుకొని వస్తానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లిన డేవిడ్ తిరిగి రాలేదు. దీంతో అతని భార్య నాగలక్ష్మి తెలిసిన వారిని, బంధువులకు వాకబు చేసినా ఆచూకీ తెలియక పోవడంతో శుక్రవారం లాలాగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

35 కేసుల ఘరానా దొంగ అరెస్టు

- పాత నేరస్తుడు పోటెల్ రమేష్‌కు రిమాండ్
- పనిమనిషి నగలు దోచుకెళ్లిన దొంగ



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న ఇన్‌స్పెక్టర్ రాజేందర్

లాలాపేట: రాత్రి వేళలలో తాళం వేసి ఉన్న ఇండ్లను టార్గెట్ చేసి దోపిడీకి పాల్పడుతున్న ఓ పాత ఘరానా నేరస్తుడిని ఉస్మానియా యూనివర్సిటీ పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌స్పెక్టర్ రాజేందర్ తెలిపిన మేరకు.. బోడుప్పల్ ఇందిరానగర్ కాలనీకి చెందిన పోటెల్ రమేష్(35) వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. ఇతనిపై ఇప్పటికే దాదాపు 34 కేసులున్నాయి.

- హబ్సిగూడ రవీంద్రనగర్‌లో వనితారెడ్డి ఇంట్లో పనిమనిషిగా ఉన్న సులోచనకు ఆదే ఇంట్లో సామాన్లు పెట్టుకోవడానికి ఓ గదిని ఇంటి యజమాని కేటాయించింది. గత నెల 26న రాత్రి వేళలో ఆ గదిలో రమేష్ దోపిడీకి పాల్పడ్డాడు. మరుసటిరోజు ఈ విషయాన్ని యజమాని వనితారెడ్డికి చెప్పింది. అల్మారాలో చూడగా అందులో ఉన్న 4.5 తులాల బంగారు, 45 తులాల వెండి, రూ 20 వేల నగదు కనిపించలేదు. ఈ మేరకు బాధితురాలు సులోచన ఓయూ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరా పూటేజీల ఆధారంగా పోటేల్ రమేష్‌ను, అతనికి సహాయకారిగా ఉన్న కర్నాటక దౌలతాబాద్‌కు చెందిన యూసుఫ్ బీ(30) లేబర్. కలిసి దోచుకున్న బంగారు, వెండి ఆభరణాలను విక్రయిస్తుండగా వారిని పట్టుకుని పోలీసు స్టేషన్‌కు తరలించి విచారించగా నేరం అంగీకరించారు. వారి వద్ద నుంచి బంగారు, వెండి ఆభరణాలను స్వాదీనం చేసుకుని వారిని రిమాండ్ తరలించారు.